సాక్షి
కాకినాడ

మంగళవారం । 30 । జూలై । 2024



ధగధగలాడేలా.. ధరణి మురిసేలా..


రత్నగిరిపై వెలసిన ఆ తల్లి మరింత ధగధగ లాడనుంది.. సిరులొసగే శ్రావణ మాసంలో వజ్రకాంతులీననుంది. - 8లో



ఉచితం అంటే లారీకి రూ.11వేలు కట్టాలా?

ప్రభుత్వం ఉచిత ఇసుక అంటోందని. కానీ. లారీకి రూ.11 వేలు వసూలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. - 8లో

డెల్టాలకు 8,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాముకు పటిష్ట భద్రత

కాకినాడ సిటీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం), వీవీ ప్యాట్‌ల గోదాముకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును సోమవారం ఆయన పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల మేరకు ప్రతి నెలా ఈ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదిక పంపిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, కాకినాడ అర్బన్ తహసీల్దార్ కె.చిన్నయదొర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అంబేడ్కర్ మెడికల్ ఎయిడ్

కాకినాడ క్రైం: ఆర్థికంగా వెనుకబడి, రూ.3 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఎస్సీ, ఎస్టీలకు డాక్టర్ అంబేడ్కర్ మెడికల్ ఎయిడ్ స్కీము ప్రయోజనాన్ని అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి నరసింహ నాయక్ ప్రోగ్రాం అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ప్రయోజనాలను ఆయా వర్గాల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కిడ్నీ, గుండె, కాలేయం, మెదడు, క్యాన్సర్, అవయవ మార్పిడి, ఇతర ప్రాణాంతక వ్యాధులతో చికిత్స పొందుతున్న వారికి ఈ పథకం ద్వారా విశేష ప్రయోజనం చేకూరుతుందన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదించి, ఈ పథకం ప్రయోజనాలు అందిపుచ్చుకోవాలని సూచించారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అప్రెంటీస్ కోసం వచ్చే నెల 1 నుంచి 16వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్లు, మోటార్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌లకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. ఆసక్తి ఉన్న వారు www. apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చునని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫామ్‌తో పాటు పదో తరగతి, ఐటీఐ మార్కుల జాబితాలు, ఆధార్, బయోడేటా, తపాలా చిరునామా, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కుల ధ్రువీకరణ తెలియజేయాల్సి ఉంటుందని వివరించారు. వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఆగస్టు 23న కోనసీమ, 24న కాకినాడ, 27న తూర్పు గోదావరి జిల్లాల్లో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని తెలిపారు. వివరాలకు 08992-294906 నంబర్‌లో సంప్రదించాలని శ్రీనివాసరావు సూచించారు.

ఎరువుల షాపులపై విజిలెన్స్ దాడులు



కొత్తపల్లిలో ఎరువుల షాపులో యూరియా బస్తాలు సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గోకవరం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎరువుల షాపులపై రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు గ్రామంలోని అన్నపూర్ణా జనరల్ స్టోర్స్, జయలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎరువులు కొనుగోలు చేసిన రైతుల వద్ద నుంచి వివరాల సేకరించి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు నిర్ధారించారు. దీంతో రెండు షాపులపై దాడులు చేసి, అన్నపూర్ణా జనరల్ స్టోర్స్‌లో రూ.55,965 విలువ గల 210 యూరియా బస్తాలు, జయలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.38,642 విలువ గల 145 యూరియా బస్తాలను సీజ్ చేసి షాపు యజమానులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఎరువుల షాపుల యజమానులు యూరియాను ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు టి.జగన్నాథరెడ్డి, ఏఓ జె.భార్గవ మహేష్, వల్లీ, లోవరాజు, శివ, లీగల్ మెట్రాలజీ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి.. హామీ ఏదీ!

- రెండు నెలలుగా ఆగిన వేతనాల చెల్లింపు
- జిల్లాలో రూ.79 కోట్ల పెండింగ్
- కూలీల ఆకలి కేకలు
- బతుకు బండి లాగేదెలాగని ఆవేదన
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

- పెద్దాపురం మండలానికి చెందిన అతని పేరు కర్రి వెంకట్రావు (పేరు మార్చాం). వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉన్న ఊళ్లోనే ఉపాధి హామీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇప్పుడు పెద్ద కష్టమే వచ్చి పడింది. ఉపాధి పనులు చేసి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదు. దీంతో కుటుంబం గడిచేదెలాగో తెలియక ఆందోళన చెందుతున్నాడు.
- కరప మండలానికి చెందిన ఆమె పేరు నక్కా సత్యవతి (పేరు మార్చాం). ఉపాధి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటోంది. కుమార్తె, కుమారుడు ఇంటర్‌కు వచ్చారు. ఈ సమయంలో వారి చదువులకు అదనంగా కొంత ఖర్చు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో మే నెల వరకూ ఉపాధి వేతనాలు సక్రమంగానే వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూన్, జూలై నెలలకు సంబంధించి కూలి డబ్బులు ఇప్పటి వరకూ రాలేదు. దీంతో కుటుంబ ఖర్చులకు డబ్బులు ఎక్కడి నుంచి తేవాలో తెలియక సత్యవతి ఆవేదన చెందుతోంది.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉన్న ఊళ్లోనే పని కల్పించేందుకు ఉద్దేశించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు గుదిబండగా మారింది. ఎండనక, వాననక చెమట చిందిస్తూ.. రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా తగిన ఫలితం దక్కడం లేదు. రెండు నెలలుగా కూలి డబ్బుల కోసం నిరీక్షణ తప్పడం లేదు. పనులు చేసినా పస్తులుండాల్సిన దుస్థితి తలెత్తిందని కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఇలాగైతే బతుకుబండి ఎలా లాగాలంటూ వాపోతున్నారు. జిల్లాలోని ఉపాధి కూలీల దుస్థితి ఇది. వేతనాల కోసం వెళ్తాంటే ఈవేళ, రేపు అంటూ అధికారులు తిప్పి పంపించేస్తున్నారు. వేతనాలు జమ అయ్యాయేమోనని ఆశగా బ్యాంక్ ఖాతాలు చూసుకోవడంతోనే సరిపోతోందని ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నారు.

10 వారాలవుతున్నా..

వలసలను నియంత్రించి, స్వగ్రామంలోనే ఉపాధి చూపే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం లక్ష్యమే కూలీలకు ఉపాధి కల్పించడం. అటువంటిది పని చేసిన రెండు నెలల కాలానికి ఇప్పటి వరకూ వేతనాలు విడుదల చేయకపోవడంతో ఉపాధి కూలీల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. పథకం నిబంధనల ప్రకారం ఉపాధి కూలీలకు పని కల్పించిన 21 రోజులు దాటకుండా వేతనాలు చెల్లించాలి. అటువంటిది జిల్లాలో జూన్, జూలై నెలల్లో పని చేసిన కూలీలకు సుమారు 10 వారాలు కావస్తున్నా వేతనాలు ఇవ్వడం లేదు. జిల్లావ్యాప్తంగా వేతన బకాయిలు రూ.79 కోట్ల మేర ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమ పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని కూలీలు మండిపడుతున్నారు. ఎన్నికలైపోయి కూటమి అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతున్నా ఉపాధి వేతనాల విడుదలకు ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు మొదలవ్వడంతో కూలీలు 'ఉపాధి'పై ఆసక్తి చూపడం లేదు. దీంతో తక్కువ స్థాయిలోనే పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ చేసిన పనులకు సంబంధించి వారానికి ఒక్కో కూలీకి రెండు నెలల వేతన బకాయి సుమారు రూ.1,796 చొప్పున వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. పనికి వెళ్లినా పైసలు చేతికి రాకపోవడంతో బతుకు చాలా కష్టమవుతోందని ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో కాకినాడ జిల్లాలో ఉపాధి పనుల వివరాలు

2021-22	6,812
2022-23	3,633
2023-24	9,712
2024-25	3,552
మొత్తం	23,816
జిల్లాలో మండలాలు	: 20
గ్రామ పంచాయతీలు	: 385
జాబ్ కార్డులు	: 2,78,000
కూలీలు	: 4,52,000
యాక్టివ్ జాబ్ కార్డులు	: 2,17,000
యాక్టివ్ కూలీలు	: 3,65,000
ప్రస్తుతం పనికి వస్తున్న వారు	: 1,94,455

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వ హయాంలో ఉపాధి వేతన బకాయిలున్నా వెంటనే చొరవ తీసుకుని పరిష్కరించేవారని, ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడని కూలీలు వాపోతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 66 లక్షల పని దినాలు లక్ష్యం కాగా, దీనికి మించి 66.71 లక్షల పని దినాలు కల్పించారు. ఒక్కో ఉపాధి కూలీకి రోజుకు రూ.300 వేతనం నిర్ణయించగా, వారు చేసిన పనికి రూ.268 చొప్పున లభించేది. 2.09 లక్షల మందికి రోజువారీ వేతనాలుగా రూ.136.05 కోట్లు, మెటీరియల్ కాంపొనెంట్‌గా రూ.42.68 కోట్లు చెల్లించారు. అప్పట్లో ప్రతి 8 రోజులకు ఒకసారి ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం వేతనాలు జమ చేసేది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా 27 వేల పనులు చేపట్టారు. ఈ ఏడాది ఇంత వరకు రూ.112.50 కోట్లు వేతనాలు కింద ఖర్చు చేశారు. మెటీరియల్ కాంపొనెంట్‌గా రూ.16.35 కోట్లు, పరిపాలనా వ్యయం కింద రూ.3.23 కోట్లు ఖర్చు చేశారు.

బకాయిలు వాస్తవమే..



జిల్లాలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి వేతన బకాయిలు ఉన్న మాట వాస్తవమే. ఇంతవరకూ మే నెల ఉపాధి కూలీలకు వేతనాలు జమ చేశాం. జూన్, జూలై నెలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే కూలీల ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉంది.

– అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ, కాకినాడ

తొలగింపులు ఆపకపోతే ఉద్యమం

- వేతనాలు నేరుగా అకౌంట్లలో వేయాలి
- రాజకీయ వేధింపులు ఆపాలి
- యానిమేటర్ల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న యానిమేటర్లు

కాకినాడ సిటీ: వెలుగు వీవోఏలపై రాజకీయ వేధింపులు అరికట్టాలని, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద యానిమేటర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. 'ప్రభుత్వం మారింది. మీ స్థానంలో మా కార్యకర్తలను నియమిస్తాం. మీరు రాజీనామా చేయండి' అంటూ టీడీపీ, జనసేన నాయకులు తమపై ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పిన వాగ్దానాన్ని మరచిపోయారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పదవీ విరమణ తర్వాత లభించే సదుపాయాలు యానిమేటర్లకు కూడా వర్తింపజేస్తే రాజీనామాలకు తాము సిద్ధమేనని ఎద్దేవా చేశారు. స్థానిక నాయకులను అదుపు చేయకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఇచ్చే రూ.10 వేల వేతనం కూడా బకాయి పెడితే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగు డిపార్ట్‌మెంట్‌లో రాజకీయ నాయకుల నుంచి కింది స్థాయి అధికారుల వరకూ ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. ఎక్కడైనా అవినీతి బయటకు వస్తే మాత్రం యానిమేటర్లను బాధ్యులను చేసి, మిగిలిన వారు తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. అవినీతిని నిర్మూలించాలనుకుంటే ముందు పైస్థాయి నుంచి ఆపాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు ఆపకపోతే జిల్లా వ్యాప్తంగా నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఏపీ వెలుగు వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.బేబీరాణి, యానిమేటర్ల సంఘం నాయకులు గంగా భవాని, దిమ్మల మేరీ, ఈశ్వరిబాయి తదితరులు పాల్గొన్నారు. యానిమేటర్ల వద్దకు డీఆర్‌డీఏ పీడీ ఎస్.రమణి వచ్చి, తన పరిధిలో ఉన్న సమస్యలను కూర్చుని పరిష్కరించుకుందామని, మిగిలిన సమస్యలు ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

ఇంట్లో తిరిగాడు.. అంతా దోచేశాడు

ప్రత్తిపాడు: ఇంట్లో తిరుగుతూ.. స్వేచ్ఛగా మసలే బంధువే ఆ ఇంటికి కన్నం వేశాడు. ఉన్నదంతా ఊడ్చేశాడు. చివరికి కటకటాల పాలయ్యాడు. ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు కథనం ప్రకారం.. స్థానిక ఫైర్ స్టేషన్ సమీపానికి చెందిన ముచ్చకర్ల అప్పలస్వామి దేవీపట్నం మండలం ఇందుకూరిపేట పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 25న విధి నిర్వహణలో భాగంగా ఆయన ఇందుకూరిపేటకు వెళ్లగా, అతని భార్య తన మామయ్య నిర్వహిస్తున్న షాపునకు వెళ్లింది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అప్పలస్వామి ఇంటి తాళాలు తెరచి, రూ.3 లక్షలు, 20 కాసుల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. దీనిపై సీఐ శేఖర్‌బాబు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతికత ఆధారంగా అప్పలస్వామి సోదరుడి కుమారుడు సాయిచరణ్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. అదే వీధిలో నివసిస్తున్న అతడు అప్పలస్వామి ఇంట్లో స్వేచ్ఛగా మసలేవాడు. సాయిచరణ్‌కు చాలా అప్పులున్నాయి. వీటి నుంచి బయట పడేందుకు చోరీకి పథక రచన చేశాడు. ప్రత్తిపాడు తోటవీధికి చెందిన అలుగుల అజయ్ వెంకటేశ్వరరావుతో కలసి కాకినాడ పాత బస్టాండ్ వీధికి చెందిన బలసాడి ధనుష్, పంతాడి సత్యసాయితో కలసి అప్పలస్వామి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆ సొత్తును పెద్దాపురంలో అద్దెకుంటున్న ఏలేశ్వరం మండలం దిబ్బలపాలేనికి చెందిన అనమల్ గనేశ్వర్ వద్ద భద్రపరిచారు. ఈ ఐదుగురూ స్థానిక ఎన్‌హెచ్‌పై ఉన్న శ్రీ పాదాలమ్మ అమ్మవారి ఆలయం సమీపాన చోరీ సొత్తు వాటాలు వేసుకుంటుండగా పోలీసులు దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 16.50 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. సాయిచరణ్‌తో పాటు, అజయ్ వెంకటేశ్వరరావు, ధనుష్, సత్యసాయిలను అరెస్ట్ చేశారు. నిందితులందరూ 20 నుంచి 23 ఏళ్ల వయసున్న బీటెక్ విద్యార్థులే కావడం విశేషం.



చోరీ సొత్తును చూపుతున్న సీఐ శేఖర్‌బాబు

ఆషాఢంలోనూ అదుర్స్

- సత్యదేవునికి హుండీల ద్వారా రూ.1.27 కోట్ల ఆదాయం
- పెద్దగా భక్తులు రాకపోయినా రాబడి అధికం
- 176 గ్రాముల బంగారం, 665 గ్రాముల వెండి కూడా..

అన్నవరం: మిగిలిన మాసాలతో పోలిస్తే సాధారణంగా ఆషాఢంలో రత్నగిరికి భక్తులు వచ్చేది తక్కువే. ఈ మాసం శుభకార్యాలకు పనికి రాదనే నమ్మకం, అడపాదడపా వర్షాలు కురవడం, పర్వదినాలు పెద్దగా లేకపోవడంతో భక్తులు పెద్దగా రారు. అయినప్పటికీ ఈ ఏడాది ఆషాఢంలో శని, ఆదివారాలు, ఏకాదశి వంటి పర్వదినాల్లో భక్తులు పెద్ద సంఖ్యలోనే రత్నగిరికి వచ్చారు. వారందరూ సత్యదేవుని దర్శించి, హుండీల్లో దండిగా కానుకలు సమర్పించడంతో అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారికి దండిగా ఆదాయం వచ్చింది. గడచిన 30 రోజులకు రికార్డు స్థాయిలో రూ.1,27,20,345 ఆదాయం సమకూరింది. దేవస్థానం హుండీలను సోమవారం తెరచి, భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. హుండీల ద్వారా రూ.1,22,83,027 నగదు, రూ.4,37,318 చిల్లర నాణాలు వచ్చాయని అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ తెలిపారు. వీటితో పాటు 175 గ్రాముల బంగారం, 665 గ్రాముల వెండి వస్తువులను కూడా భక్తులు కానుకలుగా వేశారని చెప్పారు. దేవస్థానానికి సగటున రోజుకు రూ.4,24,011 చొప్పున ఆదాయం వచ్చిందని తెలిపారు. వచ్చే నెల ఆరో తేదీ నుంచి శ్రావణ మాసం, వివాహాల సీజన్ కూడా ప్రారంభం కానుండటంతో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆగస్టు నెలలో కూడా సత్యదేవునికి హుండీల ఆదాయం భారీగానే వచ్చే అవకాశం ఉంది.



సత్యదేవుని హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

హుండీల్లో విదేశీ కరెన్సీ

సత్యదేవుని హుండీల్లో పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీ కూడా లభించింది. అమెరికన్ డాలర్లు 332, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ దీనార్‌లు 26, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దీనార్లు 5, ఆస్ట్రేలియా డాలర్లు 10, న్యూజిలాండ్ డాలర్లు 40, ఖతార్ సెంట్రల్ బ్యాంక్ రియల్స్ 55, ఒమన్ బైసాలు 100, యూరోలు 5 లభించాయి. హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో చైర్మన్, ఈఓతో పాటు డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథరాజు, దేవస్థానం సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

రైలెటు వెళ్తుంది బాబూ!

- కోనసీమ రైలు.. రెండు పుష్కర కాలాల లేటు
- 2000లో ప్రారంభించినా, కొలిక్కిరాని వైనం
- భారీగా పెరిగిన ప్రాజెక్టు వ్యయం
- మరో ఐదేళ్లు పడుతుందంటున్న నిపుణులు
- 2014-19 మధ్య నిధుల సాధనలో టీడీపీ వైఫల్యం



కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్ పనుల్లో భాగంగా గౌతమీ నదిపై పూర్తయిన పిల్లర్లు (ఫైల్)

సాక్షి, అమలాపురం: 'నీవు ఎక్కే రైలు.. ఒక జీవితకాలం లేటు' అని ఒక సినీ కవి అన్నట్టు... కోనసీమ వాసుల కలల 'కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్' పనులు ప్రారంభమై రెండు పుష్కరాల కాలం అవుతున్నా ఇంకా ఓ కొలిక్కి రాలేదు. రూ.330 కోట్ల అంచనాతో మొదలైన ఈ ప్రాజెక్టు పనులు ఇప్పుడు ఏకంగా రూ.2,120.16 కోట్లకు చేరడం గమనార్హం. మూడు నదీపాయలపై వంతెనలకు సంబంధించి పిల్లర్ల నిర్మాణం పూర్తయినప్పటికీ కోనసీమకు రైలు రావాలంటే మరో ఐదేళ్ల సమయం పడుతోందని నిపుణుల అంచనా.

కోనసీమకు రైల్వే లైన్ దశాబ్దాల నాటి కల. బ్రిటీష్ కాలంలో కాకినాడ నుంచి కోటిపల్లి వరకూ రైల్వే లైన్ ఉండేది. తరువాత దానిని తొలగించారు. కాకినాడ నుంచి కోటిపల్లి, అమలాపురం, రాజోలు మీదుగా నరసాపురం వరకూ రైల్వే లైన్ వేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతూ వచ్చారు. దీనికి ఎట్టకేలకు కేంద్రంలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో 2000 సంవత్సరం నవంబర్ 16న శంకుస్థాపన జరిగింది. అమలాపురంలోని చినవంతెన వద్ద శంకుస్థాపన శిలాఫలకాన్ని నాటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ, దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్లతో ఆవిష్కరించారు. తరువాత ఈ శిలాఫలకం అడ్డుగా ఉందని 2014-19 టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో, స్థానిక మున్సిపాలిటీ టీడీపీ ఏలుబడిలో ఉన్నప్పుడు తొలగించడం వేరే కథ. కాకినాడ నుంచి నరసాపురం వరకూ ఉన్న రైల్వే లైన్‌ను రెండో దశలో నరసాపురం నుంచి మచిలీపట్నం, రేపల్లి మీదుగా ఒంగోలు వరకూ విస్తరించాలనే ప్రతిపాదన ఉంది. దీనివల్ల కాకినాడ, మచిలీపట్నం పోర్టులకు మేలు చేకూరుతోందని అంచనా.

24 ఏళ్లు అవుతున్నా..

ఈ రైల్వే లైన్‌కు శంకుస్థాపన జరిగి 24 ఏళ్లు పూర్తి కావస్తోంది. ఈ నిర్మాణ పనులు సగం కూడా పూర్తి కాలేదు. గోదావరి నదీపాయలైన గౌతమి, వైనతేయ, వశిష్ఠలపై వంతెనల నిర్మాణాలు మొదలై ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. గౌతమిపై పూర్తి కాగా, వశిష్ఠ, వైనతేయ మీద ఒకటి, రెండు చోట్ల మాత్రమే పూర్తి కావాల్సి ఉంది. గౌతమి నది వద్ద నిర్మించిన 41 పిల్లర్లపై గెడ్డర్ల నిర్మాణ పనులకు గత నవంబరులో టెండర్లు ఖరారయ్యాయి. ఈ పనులకు రూ.295 కోట్లకు టెండర్లు పిలిచారు. టెండర్లు ఖరారైన నాటి నుంచి 24 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటికీ ఈ పనులు మొదలు కాలేదు. దీంతో పాటు వైనతేయ, వశిష్ఠ నదులపై నిర్మించిన పిల్లర్లపై గెడ్డర్లు నిర్మించాల్సి ఉంది. అలాగే ఈ రైల్వే లైన్‌లో పంట, మురుగునీటి కాలువలు, ఛానల్స్, కాలువ బోదెలపై 15 పెద్ద వంతెనలు, 170 చిన్న వంతెనలు, రోడ్లపై 48 వంతెనలు, ఒక రోడ్డు మీద వంతెన నిర్మించాల్సి ఉంది. మొత్తం 102.507 కిలోమీటర్ల పొడవైన కాకినాడ- నరసాపురం రైల్వేలైన్‌లో కాకినాడ నుంచి కోటిపల్లి వరకూ 45.30 కిలోమీటర్ల ట్రాక్ నిర్మాణం గతంలో పూర్తయ్యింది. కోటిపల్లి నుంచి నరసాపురం వరకూ 57.207 కిలోమీటర్లు నిర్మించాల్సి ఉండగా, ఇందులో కోటిపల్లి నుంచి భట్నవిల్లి వరకూ 12.05 కిలోమీటర్ల మేర భూసేకరణ జరిగింది. భట్నవిల్లి నుంచి నరసాపురం వరకూ సుమారు 45.157 కిలోమీటర్ల మేర భూసేకరణ చేయాలి.

బాబు ప్రభుత్వంపై నమ్మకం లేదు

గతంలో జరిగిన పరిణామాలు చూస్తే కోనసీమ రైల్వేలైన్‌ను చంద్రబాబు ప్రభుత్వం పూర్తి చేస్తోందనే నమ్మకం ఈ ప్రాంత వాసులకు లేకుండా పోయింది. 2000లో శంకుస్థాపన చేసే సమయంలో చంద్రబాబు నాటి వాజ్‌పేయి ప్రభుత్వానికి కీలక మద్దతుదారుడు. 2014 వరకూ ఎన్డీఏలో ఉన్నా నిధులు సాధించలేకపోయారు. 2014 నుంచి 2019 వరకూ కేంద్రంలో మోదీ ప్రభుత్వ సమయంలో సైతం ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నా ఐదేళ్లలో కేవలం రూ.1,035 కోట్లు మాత్రమే నిధులు సాధించారు. ఇదే సమయంలో ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వ ఇవ్వాల్సిన 25 శాతం వాటాలో కేవలం రూ.2 కోట్లకు మాత్రమే జీఓ ఇచ్చారు. ఆ నిధులు కూడా కేటాయించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు రూ.1,469 కోట్ల నిధులను మంజూరు చేయించింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.50 కోట్లు ఇవ్వడంతోపాటు భూసేకరణ బాధ్యతను తీసుకుంటామని చెప్పడంతో పనులు వేగం అందుకున్నాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో రైల్వే లైన్ వెళ్లే ప్రాంతాల్లో భూసేకరణకు సర్వే ప్రారంభింప చేసింది. అమలాపురం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో రెవెన్యూ అధికారులు సర్వే కూడా చేశారు. ఇంతలో రాష్ట్ర ప్రభుత్వం మారిన విషయం తెలిసిందే. తాజాగా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించింది. ఈ నిధులు సైతం ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులే. ఎన్డీఏలో టీడీపీ ప్రభుత్వం కీలక మద్దతుదారుగా ఉన్నా అదనంగా నిధులు సాధించపోవడంపై కోనసీమ వాసుల్లో అసంతృప్తి మిగిల్చింది. ప్రభుత్వం మారిన తరువాత భూసేకరణ పనులు మందగించడంతోపాటు రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పు కోసం టీడీపీకి చెందిన అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మాధుర్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు సిగపట్లు పడుతుండటం గమనార్హం.



2000లో కాకినాడ- నరసాపురం రైల్వేలైన్ కోసం అమలాపురంలో ఆవిష్కరించిన శిలాఫలకం.. టీడీపీ ప్రజాప్రతినిధులు తీసివేయించిన శిలాఫలకం ఇదే (ఫైల్)

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి మహిళ మృతి



మంగ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

జగ్గంపేట: స్థానిక నెహ్రూ కాలనీలో విద్యుదాఘాతానికి ఓ మహిళ మృతి చెందింది. ఏఎస్సై నూకరాజు కథనం ప్రకారం.. నెహ్రూ కాలనీకి చెందిన కింతాడ మంగ సోమవారం తన ఇంటి వద్ద మంచినీటి బోరు వేసేందుకు మోటారు తీగలను ప్లగ్‌లో పెడుతుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై వివరించారు.

'నన్నయ'లో అవినీతి ఆరోపణలపై విచారణకు కమిటీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్రమైన విచారణ నిర్వహించేలా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇద్దరు సభ్యులతో కూడిన విచారణ కమిటీని నియమించింది. గుంటూరుకు చెందిన రిటైర్డ్ జడ్జి ఎం.చలపతిరావు చైర్మన్‌గా, యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంవీ శంకర్ సభ్యునిగా ఈ కమిటీని వేశారు. 'నన్నయ' వర్సిటీలో 2020 జనవరి నుంచి 2023 జనవరి వరకూ వీసీగా ఉన్న ఆచార్య మొక్కా జగన్నాథరావు హయాంలో యూనివర్సిటీ నిధులు దుర్వినియోగం జరిగాయంటూ యూనివర్సిటీ మాజీ ఓఎస్డీ ఏఎస్‌వీఎస్ సాంకృత్యయన్ ఇచ్చిన ఫిర్యాదుపై సమగ్ర విచారణకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఈ కమిటీని నియమించింది. 15 రోజుల్లోగా విచారణ పూర్తి చేసి, నివేదిక ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. కమిటీ చేసే విచారణకు అవసరమైన ఏర్పాట్లను, ఖర్చులను యూనివర్సిటీయే భరించాలని రిజిస్ట్రార్‌కు సూచించారు. గతంలో ప్రొఫెసర్ జీవీఎస్ఆర్ ఆంజనేయులు, జేఎన్‌టీయూకేకు చెందిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్వీ రెడ్డి కమిటీ సభ్యులుగా విచారణ చేసి, ఇచ్చిన నివేదికపై సమగ్ర విచారణ చేసేందుకు ఈ కమిటీని నియమించారు.

శ్రీ విద్యాసాగర్ పర్యవేక్షణలో
DSC School Asst. Social
కోచింగ్ ప్రారంభం ఈ రోజే ఉ. 9 గం॥లకు
SATYAM STUDY CIRCLE
Near More Stores, రామారావుపేట, కాకినాడ. 9849238377 9948645434

ధగధగలాడేలా.. ధరణి మురిసేలా..

- అన్నవరంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి వజ్రకిరీటం
- రూ.1.50 కోట్లతో తయారు చేయించిన దాత
- వచ్చే నెల 6న సమర్పించేందుకు ఏర్పాట్లు



అనంతలక్ష్మీ సత్యవతీదేవికి చేయించిన వజ్రకిరీటం, స్వామి, అమ్మవార్ల కర్ణాభరణాలు

అన్నవరం: రత్నగిరిపై వెలసిన ఆ తల్లి మరింత ధగధగలాడనుంది.. సిరులొసగే శ్రావణ మాసంలో మరిన్ని కాంతులు తేనుంది. ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు వజ్ర కిరీటంతో శోభాయమానంగా దర్శనమివ్వనుంది. ఈ వజ్ర కిరీటాన్ని ఓ దాత దంపతులు వచ్చే నెల 6న సమర్పించనున్నారు. ఇప్పటి వరకూ బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు బంగారం, వజ్ర వైఢూర్యాలతో పొదిగిన కిరీటంతో భక్తులకు కనువిందు చేయనున్నారు.

పెద్దాపురానికి చెందిన ప్రముఖ దాత, లలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్, సూర్యకమల దంపతులు సుమారు రూ.కోటిన్నరతో తయారు చేయించిన వజ్ర కిరీటాన్ని అన్నవరంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆగస్టు ఆరున సత్యదేవుని జయంత్యుత్సవం సందర్భంగా శ్రావణ శుద్ధ విదియ నాడు సమర్పించనున్నారు. అదేరోజు నుంచి అమ్మవారికి ఈ కిరీటాన్ని అలంకరించనున్నారు. ఆ రోజు తెల్లవారుజామున రెండు గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూల విరాట్‌లకు పండితులు పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారికి వజ్ర కిరీటాన్ని దాత మట్టే సత్యప్రసాద్, సూర్యకమల దంపతులు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ చేతుల మీదుగా అర్చక స్వాములకు అందజేయనున్నారు. ఆ కిరీటాన్ని అలంకరించిన అనంతరం భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారు.

రెండేళ్ల కిందట సత్యదేవునికి..

రెండేళ్ల కిందట సత్యదేవుని జయంతి ఉత్సవం సందర్భంగా సుమారు రూ.కోటిన్నరతో తయారు చేయించిన వజ్రకిరీటాన్ని దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు స్వామివారికి సమర్పించారు. ఆ సమయంలోనే అమ్మవారికి కూడా వజ్రకిరీటం చేయిస్తానని ప్రకటించారు. దానికి అనుగుణంగానే కిరీటాన్ని సమర్పిస్తున్నారు. స్వామి, అమ్మవారికి ఆభరణాలు సమర్పించిన దాతలు చాలా మంది ఉన్నారు. అయితే స్వామి, అమ్మవార్లకు అత్యధిక మొత్తం రూ.మూడు కోట్ల విలువైన రెండు వజ్రకిరీటాలు చేయించిన దాతగా మట్టే సత్యప్రసాద్ చరిత్రలో నిలిచిపోనున్నారు. అన్నవరం దేవస్థానంలో సుమారు రూ.ఆరు కోట్లతో స్వామివారి ప్రసాద తయారీ భవనం నిర్మాణం, సహస్ర దీపాలంకార సేవ మందిరం, అందుకు అవసరమైన ఊయల, పూజా సామగ్రి, సత్యదేవునికి రోజూ సాయంత్రం ఏడు గంటలకు నిర్వహించే పంచహారతి సేవలో ఉపయోగించే వెండి సామగ్రి కూడా అందజేశారు. స్వామివారికి ప్రతి నిత్యం నివేదనకు బియ్యం సమర్పిస్తున్నారు.

కిలో బంగారం.. 130 క్యారెట్ల వజ్రాలతో..

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి సుమారు కిలో బంగారం, 130 క్యారెట్ల వజ్రాలతో కిరీటం చేయించారు. చెన్నైలోని జీఆర్‌టీ జ్యూయలర్స్ ద్వారా ఈ కిరీటం చేయించామని దాత చెప్పారు. కాగా, సత్యదేవునికి గతంలో వజ్రకిరీటం చేయించినప్పుడు కర్ణాభరణాలు చేయించలేదు. ఇప్పుడు వాటితో పాటు అమ్మవారికి కర్ణాభరణాలు కూడా చేయించారు. వీటిని అమ్మవారికి వజ్రకిరీటంతో పాటు అలంకరిస్తారు.

ఇది ఎంతో భాగ్యం



మా పెద్దలు చేసిన పుణ్యఫలంతోనే సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారికి వజ్రకిరీటాలు చేయించే భాగ్యం దక్కింది. ఇది మా పూర్వజన్మ సుకృతం. భవిష్యత్తులో స్వామి, అమ్మవార్లకు మరిన్ని ఆభరణాలు, సేవా కార్యక్రమాలు చేస్తాం.

–దాత మట్టే సత్యప్రసాద్

గంజాయి స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక మార్కండేయస్వామి గుడి సమీపంలోని గోదావరి నది పిండాల రేవు వద్ద గంజాయిని ఒకటో పట్టణ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహాకిశోర్ ఆదేశాల మేరకు ఒకటో పట్టణ పోలీసులు పిండాలరేవు వద్ద తనిఖీలు చేశారు. అక్కడ పండు (టామ్) కిలోన్నర గంజాయి తీసుకుని వచ్చి తాడితోటకు చెందిన జలగదూగుల నరేంద్రకుమార్, ధనాల భవానీశంకర్, శాంతిపురానికి చెందిన బాదంపూడి శ్యాందుర్గాప్రసాద్, గోరక్షణపేటకు చెందిన రొడ్డా రాకేష్‌లకు విక్రయిస్తున్నాడు. ఆ సమయంలో పోలీసులు దాడి చేశారు. దీంతో ప్రధాన ముద్దాయి పండు, ఏడో ముద్దాయి రొడ్డా రాకేష్‌లు పరారయ్యారు. నరేంద్రకుమార్, భవానీశంకర్, శ్యాందుర్గాప్రసాదు పట్టుబడ్డారు. వారి నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

పంట కాలువలో పడి వ్యక్తి గల్లంతు



దుర్గారావు (ఫైల్)

మలికిపురం: సఖినేటిపల్లిలోని ప్రధాన పంట కాలువలో సోమవారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. అదే గ్రామానికి చెందిన చీర్ల దుర్గారావు (36) స్థానిక మెట్ల రేవులో కాళ్లు కడుగుతూ ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. ఈ మేరకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు గాలింపు చేపట్టారు.

యువకుడి అనుమానాస్పద మృతి

హత్య అని అనుమానిస్తున్న స్థానికులు



పెద్దపూడి వెంకటరమణ (ఫైల్)



వెంకటరమణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సురేష్

సామర్లకోట: స్థానిక కుమ్మర వీధిలో పెద్దపూడి వెంకటరమణ (26) మృతి కలకలం రేపింది. సోమవారం ఆ యువకుడు ఇంట్లో మంచంపై చనిపోయి ఉండటం, శరీరంపై గాయాలు, ఫ్యాంట్ నిండా బురద ఉండటంతో హత్య చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. కుమ్మర వీధిలోని తన సొంతింట్లో వెంకటరమణ ఒక్కడే ఉంటున్నాడు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉండటంతో కూలి పని చేసుకొంటూ ఇక్కడ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటరమణ ఇంటి మరో భాగంలో అద్దెకు ఉంటున్న వారితో ఆదివారం రాత్రి ఘర్షణ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. తెల్లవారు జామున వెంకటరమణతో ఘర్షణ పడిన కాతేటి ఏసు, కాతేటి వీరబాబు, నుత్తిక పవన్‌లు అతని పరిస్థితిని గమనించారు. అప్పటికే వెంకటరమణ మృతి చెందడంతో వారంతా వెళ్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇచ్చారు. రాత్రి తమ మహిళలను దూషించడంతో వెంకటరమణను మందలించామని, తెల్లవారు జామున అతను మంచంపై మృతిచెంది ఉన్నాడని వారు పోలీసులకు తెలిపారు. అయితే వారు కొట్టడంతోనే మృతి చెందాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిందితుల సమాచారం మేరకు సీఐ సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సమీపంలో నివాసం ఉంటున్న వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలు నీటి మూటలే

- చంద్రబాబువి బూటకపు మాటలే
- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



కూటమి ప్రభుత్వ అరాచకాలు, సూపర్ సిక్స్ హామీల వైఫల్యాలపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో విఫలమవుతోందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీలన్నీ నీటి మూటలేనని ప్రజలు అప్పుడే తెలుసుకుంటూ చంద్రబాబు మాటలను మరోసారి నమ్మి మోసపోయామని వాపోతున్నారని అన్నారు. అమలాపురం హైస్కూల్ సెంటర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. తల్లికి వందనం, రైతులకు, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, ఉచిత పంటల బీమా ఇలా ఎన్నో పథకాలకు ఇంకా డబ్బులు వేయలేని కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. మంచి మనసున్న జగన్‌ను కాదని, కూటమి పార్టీలను గెలిపించి తమ కళ్లు తామే పొడుచుకున్నామన్న బాధతో ప్రజలు అంతర్మథనం చెందుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, ఆస్తుల విధ్వంసాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి పరమైన ఆపద్కాల సమయంలో అక్కరకు వస్తుందని జగన్ ప్రభుత్వంలో నిల్వ చేసిన 60 లక్షల టన్నుల ఇసుక కొండలను కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు ఊడ్చేసి అక్రమార్జనకు పాల్పడ్డారని ఆరోపించారు. త్వరలో పార్లమెంట్‌కు మధ్యంతర ఎన్నికలు తప్పవని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. అది జరిగితే రాష్ట్రంలో జగన్ సత్తా ఏంటో మళ్లీ తెలుస్తుందని చెప్పారు. అప్పుడు రాష్ట్రంలోని 25 పార్లమెంట్ స్థానాలు జగన్ గెలిచి దేశ రాజకీయాల్లో కీలకం అవుతారని తెలిపారు. కూటమి పార్టీలకు ఓట్లు వేసి ఎంత తప్పు చేశామో తెలుసుకుంటున్న ఓటర్లు జగన్ సంక్షేమ పాలనను గుర్తు తెచ్చుకుంటున్నారని అన్నారు. కేవలం లోకేష్‌కు పట్టాభిషేకం చేసేందుకు చంద్రబాబు రాష్ట్రంలో గెలిచిన పార్టీ ఉద్దండులైన సీనియర్లను పక్కన పెట్టి జూనియర్లకు మంత్రి పదవులు ఇచ్చినప్పుడు నీ రాజకీయ వ్యూహం, స్వార్థం తేటతెల్లమైందని విమర్శించారు. ఎమ్మెల్యే సీట్లు అధికంగా గెలిచి మీరు అధికారంలో ఉన్నా స్థానిక సంస్థల పరంగా 95 శాతం వరకూ వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులే అధికారంలో ఉన్న విషయాన్ని విస్మరించవద్దని సూచించారు. చంద్రబాబు, లోకేష్ కనుసన్నల్లో జరుగుతున్న విధ్వంసాలను అడ్డుకునేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో త్వరలోనే ఓ కార్యాచరణ రూపొందించి కూటమి ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్సీ అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, నాయకులు కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రసాద్, రాయుడు గోపి, చొల్లంగి అప్పారావు, యనమదల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి



శ్రీనివాస్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై సుధాకర్

కొవ్వూరు: మద్దూరులంక గ్రామంలోని అరటి తోటలో పనిచేస్తున్న దాసరి శ్రీనివాస్ (42) సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన రైతు సుంకవల్లి శ్రీహరి పొలంలో పనికి అతను మద్దూరులంకకు వెళ్లాడు. అరటి తోట నుంచి నడుచుకుంటూ బయటకు వస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగను తొక్కడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందినట్లు రూరల్ ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. మృతుడి సోదరి బాలిన ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడు పదిహేనేళ్ల కిందట భార్యకు విడాకులు ఇచ్చి పురుషోత్తపల్లిలోని తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

గోదావరిలోకి దూకిన వృద్ధురాలు

రక్షించిన స్థానికుడు



ప్రాణాలతో బయటపడిన సత్యవతి

సీతానగరం: గోదావరి పరవళ్లు తొక్కుతోంది.. వేగంగా ప్రవహిస్తున్న ఆ వరద నీటిలోకి దూకిన ఓ వృద్ధురాలిని ఓ వ్యక్తి రక్షించాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. ముగ్గళ్లకు చెందిన గంగుల సత్యవతి (70) తన కుమారులతో ఆదివారం రాత్రి గొడవపడి సోమవారం తన కుమార్తె ఇంటికి వెళ్తానని చెప్పి ఆర్టీసీ బస్సు ఎక్కింది. మునికూడలి ఇసుక రేవు వద్ద బస్సు దిగి ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిలోకి ఉదయం 6 గంటలకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఏటిగట్టుకు పది మీటర్ల దూరంలో గోదావరిలో చిక్కుకుంది. అదే సమయానికి అక్కడకు వచ్చిన వ్యక్తి రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చాడు. ఆమెను స్థానికులు సీతానగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సత్యవతి సురక్షితంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

వరద బాధితులను తక్షణం ఆదుకోండి

జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు



అప్పనపల్లి వారధి వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

మామిడికుదురు: గోదావరి వరదలతో ఇబ్బందులు పడుతున్న తీర గ్రామాల ప్రజలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. సోమవారం మామిడికుదురు మండల పరిధిలోని వరద ప్రభావిత గ్రామాల్లో ఆయన పర్యటించారు. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన ముంపు బారిన పడిన అప్పనపల్లి కాజ్‌వే, మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన ముంపునకు గురైన హిమాన్షు శుక్లా వారధి ప్రాంతాలను పరిశీలించారు. వరద బాధితులకు భోజనం అందించడంతో పాటు తాగునీరు, పాడి రైతులకు పశుగ్రాసం సమకూర్చాలన్నారు. గతంలో గోదావరి వరదల సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వరద బాధితులకు సహాయం అందించడంలో ప్రభుత్వం ఎంతో ఉదారంగా వ్యవహరించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా బాధితులకు సహాయం అందించడంలో కూడా అదే విధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము, పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్యకుమార్, గెడ్డం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఉచితం అంటే లారీకి రూ.11 వేలు కట్టాలా?

- కొత్తపేటలో కూటమి నేతల ఇసుక దోపిడీ
- రావులపాడు ఇసుక స్టాక్ పాయింటు–2 వద్ద బీ–ట్యాక్స్
- బీ– టాక్స్ అంటే బండారు ట్యాక్సా? బాబు ట్యాక్సా?
- క్యూలో వచ్చిన లారీలకు కాకుండా కప్పం కట్టిన లారీలకే ఇసుక
- ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- అక్రమాలపై అధికారులకు హెచ్చరిక



ఇసుక కోసం ఐదు రోజుల నుంచి క్యూలో ఉన్నానని జగ్గిరెడ్డికి చెబుతున్న లారీ డ్రైవర్



రూ.11 వేలు వసూలు చేస్తున్న బిల్లు జిరాక్స్ చూపించి అధికారులను నిలదీస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం రీచ్‌ల వద్ద ప్రజలను దోపిడీ చేస్తోందని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ల జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. ఆయన సోమవారం రావులపాడు పూరేటివారి చెరువు మార్గంలో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్–2 వద్ద జరుగుతున్న ఇసుక దోపిడీని బట్టబయలు చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, లారీ యజమానులతో కలిసి స్టాక్ పాయింట్ వద్దకు వెళ్లారు. ఇక్కడ టీడీపీ రౌడీలు లారీల నుంచి వసూలు చేస్తున్న రూ.11 వేల రశీదు జిరాక్స్ చూపించారు. ఇంత కట్టినా స్థానిక లారీలను కాదని, టీడీపీ నేతల లారీల్లోనే లోడింగ్ చేసి విశాఖ, అమరావతికి తరలిస్తున్నారని చెప్పారు. ఇసుక లోడింగ్‌లో అక్రమాలు, అవినీతిపై అధికారులను నిలదీశారు. జాయింట్ కలెక్టర్, జిల్లా ఇసుక కమిటీ విధివిధానాలను తుంగలో తొక్కి స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కొత్త దందాకు తెర తీశారని ధ్వజమెత్తారు. అక్కడి నుంచే కొత్తపేట ఆర్డీవోతో ఫోనులో మాట్లాడారు. నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, పార్టీలకు అతీతంగా అందరికీ ఇసుక ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే స్టాక్‌పాయింట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. తాము వస్తున్నామని, అవినీతి బయటపడుతుందనే ఇక్కడ ఎగుమతులు నిలిపివేశారని మండిపడ్డారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

అడ్డు లేకుండా ఇసుక దోపిడీ

అనంతరం జగ్గిరెడ్డి అక్కడే విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో ఇసుక కొరత రాకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వలు పెడితే.. ఈ ప్రభుత్వం వచ్చాక రెండు నెలలు కాకుండానే 40 లక్షల మెట్రిక్ టన్నులు ఎగుమతి చేసినట్టు చూపిస్తున్నారని అన్నారు. ఇక్కడి పాయింట్–2 వద్ద 80 వేల టన్నులు గుర్తించగా అప్పడే 40 వేలు టన్నులు ఎగుమతి చేశారని చూపిస్తున్నారని, అధికారుల లెక్కల ప్రకారం ఇక్కడ 10 వేల టన్నులు కూడా లేదని చెప్పారు. ఇసుకనంతా టీడీపీ నేతలు ఇష్టానుసారం దోపిడీ చేస్తున్నారని అన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరదల సమయంలో సైతం ప్రజలకు ఇసుక లభించేలా స్టాక్ ఉంచితే.. ఎన్నికల్లో చంద్రబాబు సెల్ఫీల పేరుతో నానా హంగామా చేశారన్నారు. అప్పట్లో ఏ అవినీతికీ పాల్పడకపోయినా జే–ట్యాక్స్ అంటూ హడావిడి చేశారన్నారు. ఇప్పుడు టీడీపీ చేస్తున్న బీ–ట్యాక్స్ దందా గురించి వారి జేబు పత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతిల్లోనే పతాక శీర్షికల్లో రాస్తున్నారని అన్నారు. బీ–ట్యాక్స్ అంటే బండారు ట్యాక్సా, బాబు ట్యాక్సా చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పట్లో బాబు, ఎమ్మెల్యే సత్యానందరావు స్టాక్ పాయింట్ల వద్ద సెల్ఫీలు దిగింది బీ–ట్యాక్స్ వసూలుకేనని ఇప్పుడు అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. ముందు వచ్చిన వారికి ముందు ఇవ్వాలన్న నిబంధన పాటించడంలేదని మండిపడ్డారు. లారీకి రూ.4,900 బిల్లు ఇచ్చి, స్టాక్ పాయింట్ వద్ద టీడీపీ రౌడీలు రూ.11,000 వసూలు చేస్తున్నారన్నారు. దీనిలో రూ.6,100 పైనే స్థానిక నాయకుల జేబులోకి వెళ్తోందంటూ ఆంధ్రజ్యోతి పేపర్‌లోనే రాశారని చెప్పారు. అలాగే జిల్లాలోని ఆలమూరు మండలానికి చెందిన ఒక టీడీపీ వీరాభిమాని సాక్షాత్తు మంత్రి నారా లోకేష్‌కే సామాజిక మాధ్యమాల వేదికగా ఇసుక అక్రమాలపై చర్యలు తీసుకోవాలంటూ విన్నవించుకున్నారంటూ ఆ పోస్టు మీడియాకు చూపించారు.

ఇప్పుడు తీసుకోండి సెల్ఫీలు

ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత నీటిపారుదల శాఖ మంత్రి నీకు రూ.15,000, నీకు రూ.15,000, నీకు రూ.18,000 అంటూ మహిళల వద్ద ఊదరగొట్టారని, అది అమలు చేయలేదు కానీ ఇసుక కోసం వచ్చిన లారీల వద్ద నీ దగ్గర రూ.11,000 నీ దగ్గర రూ.11,000 అంటూ వసూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు వచ్చి ఈ స్టాక్ యార్డుల వద్ద జరుగుతున్న దందాలపై కూడా సెల్ఫీలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అక్కడున్న ఉన్న లారీ డ్రైవర్లతో జగ్గిరెడ్డి మాట్లాడారు. లారీ లైన్‌లో పెట్టి 6 రోజులు అయిందని, ఇప్పటికీ ఇసుక ఇవ్వలేదని ఆర్థికంగా చాలా నష్టపోతున్నామని పలువురు తెలిపారు. కార్యక్రమంలో అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

PYDAH V R T DEGREE COLLEGE
WALK-IN-INTERVIEW
Required Faculty to teach the following subjects for
Agriculture, Forensic Science, Fisheries, Food-Technology, Micro Biology, Physics, Mathematics, English, Soft Skills & Computer Science.
Non Teaching Staff : HR Manager, Accountant, Office Assistants & Lab Assistants
Interested candidates can walk along with original certificates, Xerox copies & Passport size photos on 30-07-2024 to 03-08-2024 9:30 AM@
Pydah V R T Degree College, Yanam Road, Patavala, KAKINADA.
Ph : 94404 59718, 98495 45948, E-mail : principal.agri@pydah.edu.in

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted

■ కాకినాడ Foton Decors ఇండస్ట్రీ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన Marketing Executives (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి. సంప్ర॥ 88826 56789 [R-1229034]

■ కష్టమైన్నీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూం+భోజనం.HYD.Ph: 6309020999 [HA-432]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14415]

■ టీమ్‌లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ బ్యాంక్ అనుబంధ సంస్థలో కావలెను. Sal + Inc - 40 వేలు, వ: 30-65 Yrs, Q : 10th+, రిటైర్డ్, వ్యాపారస్తులు, RMP డాక్టర్స్, గృహిణులు, ఇన్సూరెన్స్ ఏజంట్స్‌కు, మార్కెటింగ్ సాయంత్రం 6 to 10 మాత్రమే ఫోన్ చేయండి. ✆ 99666 34511 [B-182]

కావలెను
ఆదిత్య యూనివర్శిటీ
సూరంపాలెంలో పనిచేయుటకు బస్సు డ్రైవర్లు కావలెను.
స్కూలు బస్సు డ్రైవింగ్‌లో అర్హత, అనుభవం కలిగిన డ్రైవర్లు.
కాకినాడ, రాజమండ్రి, దాగల్లు, కొవ్వూరు, సీతానగరం, యానాం, రావులపాలెం, రామచంద్రాపురం, జగ్గంపేట, గోకవరం, మండపేట, కత్తిపూడి, అన్నవరం, ఉప్పాడ తదితర ప్రాంతాల నుండి విద్యార్థులను తీసుకుని వచ్చుటకు...
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు -
ఆదిత్య యూనివర్శిటీ, సూరంపాలెం.
99518 96665, 76598 76668

■ Job Vacancy : YIP PVT LTD. Age : 18 to 45 Yrs. Qual. : 10th to Any Degree, Salary : 18000/- to 25000/- (Work From Home Available). ✆ 89789 45341. [M-1185373]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 81218 18692 [M-1185372]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.